12-10-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - శ్రీమతంపై నడిచినట్లయితే మీ ఖజానాలన్నీ నిండుగా అవుతాయి, మీ భాగ్యము ఉన్నతముగా తయారవుతుంది"

ప్రశ్న:- ఈ కలియుగంలో ఏవి దివాలా అయ్యాయి? దివాలా తీయడంతో దీని పరిస్థితి ఏమయ్యింది?

జవాబు:- కలియుగంలో పవిత్రత, సుఖము మరియు శాంతి దివాలా తీసాయి, అందుకే భారత్ సుఖధామము నుండి దుఃఖధామముగా, వజ్రము నుండి గవ్వ సమానంగా అయ్యింది. ఈ ఆట అంతా భారత్ గురించే ఉంది. ఆట యొక్క ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని ఇప్పుడు తండ్రి మీకు వినిపిస్తున్నారు. అదృష్టవంతులైన, సౌభాగ్యశాలురైన పిల్లలే ఈ జ్ఞానాన్ని మంచి రీతిలో అర్థం చేసుకోగలుగుతారు.

పాట:- భోళానాథుని కన్నా అతీతమైనవారు... (భోలేనాథ్ సే నిరాలా...)

ఓం శాంతి. భగవానువాచ. ఏ భగవంతుడు? భోళానాథుడైన శివ భగవానువాచ. తండ్రి కూడా అర్థం చేయిస్తారు, టీచర్ పని కూడా అర్థం చేయించడమే. సద్గురువు పని కూడా అర్థం చేయించడమే. శివబాబానే సత్యమైన బాబా, భోళానాథుడు అని అంటారు. శంకరుడిని భోళా అని అనరు. అతని గురించైతే - కన్ను తెరిచి సృష్టినంతటినీ భస్మం చేసారు అని అంటారు. భోళా భండారీ అని శివుడినే అంటారు అనగా ఖజానాలను నిండుగా చేసేవారు. ఏ ఖజానా? ధన-సంపదలు, సుఖ-శాంతుల ఖజానా. పవిత్రత-సుఖము-శాంతి యొక్క ఖజానాలను నిండుగా చేసేందుకే తండ్రి వచ్చారు. కలియుగంలో పవిత్రత-సుఖము-శాంతి దివాలా తీసాయి ఎందుకంటే రావణుడు శాపం ఇచ్చాడు. అందరూ శోకవాటికలో ఏడుస్తూ-రోదిస్తూ ఉంటారు. భోళానాథుడైన శివుడు కూర్చొని సృష్టి ఆదిమధ్యాంతాల రహస్యాన్ని అర్థం చేయిస్తారు అనగా పిల్లలైన మిమ్మల్ని త్రికాలదర్శిగా తయారుచేస్తారు. డ్రామా గురించైతే ఇంకెవరికీ తెలియదు. మాయ పూర్తిగా వివేకహీనులుగా చేసేసింది. ఈ గెలుపు-ఓటములు, సుఖ-దుఃఖాల నాటకమంతా భారత్ దే. భారత్ వజ్ర సమానంగా సంపన్నంగా ఉండేది, ఇప్పుడు గవ్వ వలె నిరుపేదగా ఉంది. భారత్ సుఖధామంగా ఉండేది, ఇప్పుడు దుఃఖధామంగా ఉంది. భారత్ స్వర్గంగా ఉండేది, ఇప్పుడు నరకంగా ఉంది. నరకము నుండి మళ్ళీ స్వర్గంగా ఎలా అవుతుంది, దాని ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని జ్ఞానసాగరుడు తప్ప ఇంకెవ్వరూ అర్థం చేయించలేరు. ఇది కూడా బుద్ధిలో నిశ్చయం ఉండాలి. ఎవరి భాగ్యమైతే తెరుచుకోనున్నదో, ఎవరైతే సౌభాగ్యశాలురుగా అవ్వనున్నారో వారికి నిశ్చయం ఉంటుంది. దుర్భాగ్యశాలురుగా అయితే అందరూ ఉన్నారు. దుర్భాగ్యశాలురు అనగా భాగ్యము పాడైపోయి ఉండటము. భ్రష్టాచారులుగా ఉన్నారు. తండ్రి వచ్చి శ్రేష్ఠాచారులుగా తయారుచేస్తారు. కానీ ఆ తండ్రి గురించి కూడా ఎవరో కష్టం మీద అర్థం చేసుకోగలరు ఎందుకంటే వారికి దేహము లేదు. సుప్రీమ్ ఆత్మ (పరమాత్మ) మాట్లాడుతారు. పావనాత్మలు ఉండడమే సత్యయుగంలో ఉంటారు. కలియుగంలో అందరూ పతితులు ఉన్నారు. అనేక మనోకామనలతో జగదాంబ వద్దకు వెళ్తారు, వారికి ఏమీ తెలియదు, కానీ తండ్రి అంటారు - ఎవరెవరు, ఏయే భావనతో పూజ చేస్తారో దాని అనుసారంగా నేను వారికి అల్పకాలిక క్షణభంగుర ఫలాన్ని ఇస్తాను. జడ మూర్తులు ఎప్పుడూ ఆ ఫలాన్ని ఇవ్వలేవు. ఫలాన్ని ఇచ్చేవాడిని, అల్పకాలిక సుఖాన్ని ఇచ్చేవాడిని నేనే మరియు అనంతమైన సుఖదాతను కూడా నేనే. నేను దుఃఖదాతను కాదు. నేను దుఃఖహర్త, సుఖకర్తను. మీరు సుఖధామంలో స్వర్గ వారసత్వాన్ని పొందేందుకు వచ్చారు. ఇందులో పథ్యము ఎంతో ఉంది. తండ్రి అర్థం చేయిస్తారు - ఆదిలో సుఖముంది, ఆ తర్వాత మధ్యలో భక్తి మార్గం ప్రారంభమైనప్పుడు సుఖము పూర్తయ్యి దుఃఖము మొదలవుతుంది. ఆ తర్వాత దేవీ-దేవతలు వామ మార్గంలో, వికారీ మార్గంలో పడిపోతారు. అక్కడి నుండే మళ్ళీ భక్తి ప్రారంభమవుతుంది. కావున ఆదిలో సుఖము ఉంటుంది, మధ్యలో దుఃఖము మొదలవుతుంది. అంతిమంలోనైతే అత్యంత దుఃఖము ఉంటుంది. తండ్రి అంటారు - ఇప్పుడు సర్వులకు శాంతిదాతను, సుఖదాతను నేనే. మిమ్మల్ని సుఖధామంలోకి తీసుకువెళ్ళేందుకు తయారుచేస్తున్నాను. మిగిలినవారంతా లెక్కాచారాలను సమాప్తం చేసుకొని శాంతిధామానికి వెళ్ళిపోతారు. శిక్షలైతే ఎన్నో అనుభవిస్తారు. ట్రిబ్యునల్ (న్యాయ సభ) కూర్చుంటుంది. బాబా అర్థం చేయించారు, కాశీలో కూడా బలి అయ్యేవారు. కత్తుల బావిలో దూకి బలి అయ్యే ఆచారము ఉండేది కదా. ఇప్పుడు కాశీలో శివుని మందిరముంది. అక్కడ భక్తి మార్గంలో శివబాబా స్మృతిలో ఉంటారు. ఇక ఇప్పుడు మేము మీ వద్దకు వచ్చేస్తాము అని అంటారు. ఎంతో ఏడుస్తూ-ఏడుస్తూ శివునిపై బలిహారమవుతారు, అప్పుడు అల్పకాలిక క్షణభంగురమైన కొద్దిపాటి సుఖము లభిస్తుంది. ఇక్కడ మీరు బలిహారమవుతారు అనగా 21 జన్మల వారసత్వాన్ని పొందేందుకు జీవిస్తూనే శివబాబాకు చెందినవారిగా అవుతారు. ఆత్మహత్య యొక్క విషయమేమీ కాదు. జీవిస్తూనే - బాబా, నేను మీ వాడిని. వారైతే శివునిపై

బలిహారమవుతారు, మరణిస్తారు, మేము శివబాబాకు చెందినవారిగా అయిపోతాము అని భావిస్తారు. కానీ అలా అవ్వరు. ఇక్కడైతే జీవిస్తూనే తండ్రికి చెందినవారిగా అవుతారు, ఒడిలోకి వస్తారు, మరి తర్వాత తండ్రి మతముపై నడవవలసి ఉంటుంది, అప్పుడే శ్రేష్ఠమైన దేవతలుగా అవ్వగలుగుతారు. ఇప్పుడు మీరు అలా అవుతున్నారు. కల్ప-కల్పమూ మీరు ఈ పురుషార్థం చేస్తూ వచ్చారు. ఇది కొత్త విషయమేమీ కాదు.

ప్రపంచం పాతబడుతుంది. మళ్ళీ తప్పకుండా కొత్తది కావాలి కదా. భారత్ కొత్తగా, సుఖధామంగా ఉండేది, ఇప్పుడు పాతగా, దుఃఖధామంగా ఉంది. మనుష్యులు ఎంత రాతిబుద్ధి కలవారిగా ఉన్నారంటే - సృష్టి ఒక్కటే ఉంటుంది, అది కేవలం కొత్తదిగా మరియు పాతదిగా అవుతుంది అన్నది అర్థం చేసుకోరు. మాయ బుద్ధికి తాళం వేసేసి పూర్తిగా తుచ్ఛబుద్ధి కలవారిగా చేసేసింది, అందుకే కర్తవ్యం గురించి తెలియకుండానే దేవతలను పూజిస్తూ ఉంటారు, దీనిని అంధ విశ్వాసము అని అంటారు. దేవీల పూజలకు కోట్ల రూపాయలను ఖర్చు చేస్తారు, వారిని పూజించి, తినిపించి-తాగించి, ఆ తర్వాత సముద్రంలో ముంచేస్తారు, మరి ఇది బొమ్మల పూజ అయినట్లే కదా. దీని వలన లాభమేముంది? ఎంత వైభవోపేతంగా జరుపుతారు, ఖర్చు చేస్తారు, వారం తర్వాత స్మశానంలో పూడ్చివేసినట్లుగా ఇక్కడ సాగరంలో ముంచేస్తారు. భగవానువాచ - ఇది అసురీ సాంప్రదాయం యొక్క రాజ్యము, నేను మిమ్మల్ని దైవీ సాంప్రదాయంవారిగా తయారుచేస్తాను. ఎవరికైనా నిశ్చయం ఏర్పడడం చాలా కష్టము ఎందుకంటే బాబాకు సాకార రూపము ఉండదు. ఆగా ఖాన్ సాకారంలో ఉన్నప్పుడు వారికి ఎంతమంది అనుచరులు ఉండేవారు, వారిని బంగారము-వజ్రాలతో తూకం వేసేవారు. ఇంతటి మహిమ ఏ రాజుకూ ఉండదు. కావున తండ్రి అర్థం చేయిస్తారు - దీనిని అంధశ్రద్ధ అని అంటారు ఎందుకంటే స్థిరమైన సుఖమైతే ఏమీ లేదు కదా. చాలా అశుద్ధంగా కూడా ఉంటారు, గొప్ప-గొప్ప వ్యక్తుల ద్వారా పెద్ద-పెద్ద పాపాలు జరుగుతాయి. తండ్రి అంటారు - నేను పేదల పెన్నిధిని. పేదవారి ద్వారా అన్ని పాపాలు జరగవు. ఈ సమయంలో అందరూ పాపాత్ములుగా ఉన్నారు. ఇప్పుడు మీకు అనంతమైన తండ్రి లభించారు, అయినా కానీ మీరు వారిని ఘడియ-ఘడియ మర్చిపోతారు. అరే, మీరు ఆత్మ కదా! ఆత్మను కూడా ఎప్పుడూ, ఎవరూ చూడలేదు. ఒక నక్షత్రము వలె భృకుటి మధ్యలో ఉంటుందని భావిస్తారు. ఎప్పుడైతే ఆత్మ వెళ్ళిపోతుందో అప్పుడు శరీరము అంతమైపోతుంది. ఆత్మ నక్షత్రము వంటిది కావున తప్పకుండా ఆత్మలమైన మన తండ్రి కూడా మనలాగే ఉంటారు. కానీ వారు సుఖసాగరుడు, శాంతిసాగరుడు. నిరాకారుడు వారసత్వాన్ని ఎలా ఇస్తారు? తప్పకుండా భృకుటి మధ్యలోకి వచ్చి కూర్చుంటారు. ఆత్మ ఇప్పుడు జ్ఞానాన్ని ధారణ చేసి దుర్గతి నుండి సద్గతిలోకి వెళ్తుంది. ఇప్పుడు ఎవరు చేస్తే వారు పొందుతారు. తండ్రిని స్మృతి చేయకపోతే వారసత్వాన్ని కూడా పొందరు. ఎవరినైనా తమ సమానంగా వారసత్వాన్ని పొందేందుకు యోగ్యులుగా తయారుచేయకపోతే వారు పైసకు విలువ చేసే పదవిని పొందుతారని భావిస్తారు. శ్రేష్ఠాచారులు మరియు భ్రష్టాచారులు అని ఎవరిని అంటారు, ఇది తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. ఒకప్పుడు భారత్ లోనే శ్రేష్ఠాచారీ దేవతలు ఉండేవారు. హెవెన్లీ గాడ్ ఫాదర్... అని గానం చేస్తారు కూడా. కానీ హెవెన్లీ గాడ్ ఫాదర్ ఎప్పుడు వచ్చి సృష్టిని స్వర్గంగా తయారుచేస్తారు అనేది తెలియదు. మీకు తెలుసు, కానీ పూర్తి పురుషార్థం చేయరు, అది కూడా డ్రామానుసారంగానే జరుగుతుంది, ఎవరి భాగ్యంలో ఎంత ఉంటే అంత. బాబాను ఒకవేళ ఎవరైనా అడిగితే బాబా వెంటనే చెప్పగలుగుతారు - మీరు ఈ నడవడికతో ఉండగా శరీరము వదిలేస్తే ఈ పదవిని పొందుతారు అని. కానీ అలా అడిగే ధైర్యాన్ని కూడా ఎవరూ ఉంచరు. ఎవరైతే మంచిగా పురుషార్థం చేస్తారో, వారు - మేము అంధులకు చేతికర్రగా ఎంతవరకు అవుతున్నాము అనేది అర్థం చేసుకోగలరు. తండ్రి కూడా అర్థం చేసుకుంటారు - ఫలానావారు మంచి పదవిని పొందుతారు, ఫలానా బిడ్డ ఏ సేవను చేయడం లేదు కావున అక్కడ కూడా దాస-దాసీగా అవుతారు అని. ఇల్లు ఊడ్చేవారు, శ్రీకృష్ణుడిని పాలన చేసేవారు, మహారాణిని అలంకరించే దాస-దాసీలు కూడా ఉంటారు కదా. వారు పావనమైన రాజులు, వీరు పతిత రాజులు. కావున పతిత రాజులు పావనమైన రాజుల మందిరాలను తయారుచేసి వారిని పూజిస్తారు. కానీ ఏమీ తెలియదు.

బిర్లా మందిర్ ఎంత పెద్దది. లక్ష్మీ-నారాయణుల మందిరాలను ఎన్ని తయారుచేస్తారు, కానీ లక్ష్మీ-నారాయణులు ఎవరు అన్నది తెలియదు. మరి వారికి ఎంత లాభం కలుగుతుంది? అల్పకాలిక సుఖము. జగదాంబ వద్దకు వెళ్తారు, కానీ జగదాంబయే లక్ష్మిగా అవుతారని తెలుసా. ఈ సమయంలో జగదాంబ ద్వారా విశ్వంలోని మీ మనోకామనలన్నీ పూర్తి అవుతున్నాయి. విశ్వ రాజ్యాన్ని తీసుకుంటున్నారు. జగదాంబ మిమ్మల్ని చదివిస్తున్నారు. ఆమె మళ్ళీ లక్ష్మిగా అవుతారు. ఆమె నుండే ప్రతి సంవత్సరము మళ్ళీ యాచిస్తుంటారు. ఎంత తేడా ఉంది! లక్ష్మి నుండి ప్రతి సంవత్సరమూ ధనాన్ని యాచిస్తూ ఉంటారు. లక్ష్మిని ఎప్పుడూ - మాకు కొడుకు కావాలి లేక అనారోగ్యాన్ని దూరం చేయండి అని అడగరు. అలా అనరు. లక్ష్మి నుండి కేవలం ధనాన్నే యాచిస్తారు. పేరే లక్ష్మీ పూజ. జగదాంబ నుండైతే

ఎన్నో యాచిస్తారు. ఆమె అన్ని కోరికలను పూర్తి చేసేవారు. ఇప్పుడు మీకు జగదాంబ ద్వారా - స్వర్గ రాజ్యాధికారము లభిస్తుంది. లక్ష్మి నుండి ప్రతి సంవత్సరం ఎంతో కొంత ధనం యొక్క ఫలము లభిస్తుంది, కావుననే ప్రతి సంవత్సరమూ పూజిస్తారు. ఆమె ధనమిస్తారు అని భావిస్తారు. ధనముతో పాపాలు చేస్తూ ఉంటారు. ధనాన్ని ప్రాప్తి చేసుకునేందుకు కూడా పాపాలు చేస్తారు.

ఇప్పుడు పిల్లలైన మీకు అవినాశీ జ్ఞాన రత్నాలు లభిస్తాయి, వీటి ద్వారా మీరు సుసంపన్నులుగా అవుతారు. జగదాంబ నుండి స్వర్గ రాజ్యాధికారం లభిస్తుంది. అక్కడ పాపము ఉండదు. ఇవి ఎంతగా అర్థం చేసుకోవలసిన విషయాలు. కొందరైతే బాగా అర్థం చేసుకుంటారు, కొందరైతే అసలేమీ అర్థం చేసుకోరు ఎందుకంటే వారి భాగ్యములో లేదు. శ్రీమతంపై నడవకపోతే శ్రేష్ఠంగా అవుతారా. మళ్ళీ పదవి భ్రష్టమైపోతుంది. మొత్తం రాజధాని అంతా స్థాపనవుతుంది - ఇది అర్థం చేసుకోవాలి. గాడ్ ఫాదర్ దైవీ రాజ్యస్థాపనను చేస్తున్నారు, తర్వాత భారత్ స్వర్గముగా అవుతుంది. దీనిని కళ్యాణకారీ యుగము అని అంటారు. ఇది ఎక్కువలో ఎక్కువ 100 సంవత్సరాల యుగము. మిగిలిన యుగాలన్నీ 1250 సంవత్సరాలు ఉంటాయి. అజ్మేర్ లో వైకుంఠం యొక్క మోడల్ ఉంది, అక్కడ స్వర్గం ఎలా ఉంటుందో చూపిస్తారు. స్వర్గమైతే తప్పకుండా ఇక్కడే ఉంటుంది కదా. ఏ కాస్త విన్నా స్వర్గంలోకి వస్తారు, కానీ చదువుకోకపోతే ఆటవికుల వలె ఉంటారు. ప్రజలు కూడా నంబరువారుగా ఉంటారు కదా. కానీ అక్కడ పేదవారికి, షావుకారులకు అందరికీ సుఖము ఉంటుంది. ఇక్కడైతే దుఃఖమే దుఃఖము ఉంది. భారత్ సత్యయుగంలో సుఖధామంగా ఉండేది, కలియుగంలో దుఃఖధామంగా ఉంది. ఈ ప్రపంచ చరిత్ర-భౌగోళికము రిపీట్ అవ్వనున్నది. భగవంతుడు ఒక్కరే. ప్రపంచము కూడా ఒక్కటే. కొత్త ప్రపంచంలో మొదట భారత్ ఉంటుంది. ఇప్పుడు భారత్ పాతబడిపోయింది, ఇదే మళ్ళీ కొత్తగా తయారవ్వనున్నది. ప్రపంచం యొక్క చరిత్ర-భౌగోళికము ఇలా రిపీట్ అవుతూ ఉంటుంది, ఇంకెవరికీ ఈ విషయాల గురించి తెలియదు. అందరూ ఒకే విధంగా ఉండరు. పదవులైతే అక్కడ కూడా ఉంటాయి. అక్కడ సిపాయిలు ఉండరు ఎందుకంటే అక్కడ భయము ఉండదు. ఇక్కడ భయముంటుంది, అందుకే సిపాయిలు మొదలైనవారిని పెట్టుకుంటారు. భారత్ ను ముక్కలు-ముక్కలుగా చేసేసారు. సత్యయుగంలో విభజనలు ఉండవు. లక్ష్మీ-నారాయణుల రాజ్యం ఒక్కటే ఉంటుంది. ఏ పాపమూ ఉండదు. ఇప్పుడు తండ్రి అంటారు - పిల్లలూ, నా మతంపై నడుస్తూ, నా నుండి సదా సుఖ వారసత్వాన్ని తీసుకోండి. సద్గతి మార్గాన్ని ఒక్క తండ్రే చూపిస్తారు. ఇది శివశక్తి సైన్యము, ఈ సైన్యము భారత్ ను స్వర్గముగా తయారుచేస్తుంది. ఈ తనువు-మనస్సు-ధనము అన్నింటినీ ఈ సేవలో వినియోగిస్తారు. ఆ బాపూజీ క్రిస్టియన్లను పారద్రోలారు, అది కూడా డ్రామాలో ఉంది. కానీ దాని వలన సుఖమేమీ లభించలేదు. ఇది లభిస్తుంది, ఇది జరుగుతుంది... అని అంటారు. లభించేది కేవలం తండ్రి నుండే. మిగిలినదంతా అంతమైపోతుంది. జనాభా నియంత్రణ చేయండి అని అంటారు, దాని కొరకు ఎంతో కష్టపడుతూ ఉంటారు, కానీ ఏమీ జరగదు. ఇప్పుడు కాస్త యుద్ధం ప్రారంభమయ్యిందంటే కరువు వస్తుంది. పరస్పరంలో కొట్లాటలు జరుగుతాయి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. జీవిస్తూనే తండ్రిపై బలిహారమవ్వాలి అనగా తండ్రికి చెందినవారిగా అయి తండ్రి శ్రీమతం పైనే నడవాలి. మీ సమానంగా తయారుచేసే సేవను చేయాలి.

2. అవినాశీ జ్ఞాన రత్నాలను దానం చేసి జగదాంబ సమానంగా సర్వుల మనోకామనలను పూర్తి చేసేవారిగా అవ్వాలి.

వరదానము:- సేవలలో సదా సహయోగిగా అయ్యి సహజయోగపు వరదానాన్ని ప్రాప్తి చేసుకునే విశేషతా సంపన్న భవ

బ్రాహ్మణ జీవితము విశేషతా సంపన్నమైన జీవితము, బ్రాహ్మణులుగా అవ్వటము అనగా సహజయోగీ భవ అన్న వరదానాన్ని ప్రాప్తి చేసుకోవటము. ఇదే అన్నింటికన్నా మొదటి జన్మ వరదానము. ఈ వరదానాన్ని బుద్ధిలో సదా గుర్తుంచుకోవడము అంటే - ఇదే వరదానాన్ని జీవితములోకి తీసుకురావటము. వరదానాన్ని స్థిరంగా ఉంచుకునేందుకు సహజ విధి - సర్వ ఆత్మల కొరకు వరదానాన్ని సేవలో వినియోగించటము. సేవలో సహయోగిగా అవ్వటమే సహజయోగిగా అవ్వటము. కావున ఈ వరదానాన్ని స్మృతిలో ఉంచుకొని విశేషతా సంపన్నులుగా అవ్వండి.

స్లోగన్:- మీ మస్తక మణి ద్వారా స్వ స్వరూపాన్ని మరియు శ్రేష్ఠ గమ్యపు సాక్షాత్కారాన్ని చేయించటమే లైట్ హౌస్ గా అవ్వటము.